# ఋణం

ఆరో తరగతి చదువుకునే రోజుల్లో పల్లెవాసం మంచిదా, పట్నవాసం మంచిదా అనే అంశం మీద డిబేట్ పెట్టారు. నేను పల్లెవాసమే అన్ని రకాల ఉత్తమమైనదని మాట్లాడి బహుమతి గెల్చుకున్నా. దానిక్కారణం మా వూరు. ఒంగోలు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మా గ్రామం వసంతం వరించిన వసంలా ఉండేది. ఎటు చూసినా పచ్చటి పొలాల్తో కళకళలాడుతూ . . పరవళ్ళు తొక్కే జలపాతంలా . . . వయసొచ్చి మురిపించే హరిత కన్యలా . . . మా వూరు.

డిగ్రీ పాసయ్యాక ఉద్యోగాల వేటలో బతుకు తెరువుని వెతుక్కుంటూ మహానగరం చేరుకున్నా. భాగ్యవంతుల కోసమే భాగ్యనగరం తప్ప నాలాంటి అభాగ్యుల కోసం కాదని ఆలస్యంగా అర్థమై . . . నేను కాలేజీ రోజుల్లో గెలికిన కవిత్వాల పుణ్యం వల్ల ఓ ప్రముఖ దినపత్రిక ఆఫీసులో ఏదో చిన్న ఉద్యోగం సంపాయించుకున్నా.

మాకు శెలవు దినమైన గురువారాలు రోడ్లు పట్టుకు ఆవారాలా తిరుగుతున్న ఒకానొక సమయంలో రమణ కలిశాడు. లాన్సర్ కారులో వెనక ఠీవిగా కూచుని. . . డబ్బు వాసన కొడ్తూ . . . నేను గుర్తు పట్టలా. తనే గుర్తుపట్టి, కారాపి, నన్ను తన పక్కన కూచోపెట్టుకుని యింటికి పిల్చుకెళ్ళాడు. అది యిల్లు కాదు - ఇంద్ర భవనం. నాకు కళ్ళు తిరిగాయి.

"మన వూరెలా ఉంది?" చల్లగా ఉన్న ఏ.సి. గదిలో కూచోబెట్టి అడిగాడు.

మా వూరు తల్చుకోగానే దుఃఖం వచ్చింది. ఒకప్పుడు పాడిపంటల్తో, మనుషుల్తో కళకళలాడిన వూరు ఏదో ఓ రోజు వల్లకాటిలా మారే ప్రమాదం కళ్ళముందు కదలాడి, అంత చల్లటి గదిలోనూ చెమటలు పట్టాయి.

"ఏం చెప్పమంటావు? వూరొదిలి పట్నాలకు వలస వెళ్ళేవాళ్ళు ఎక్కువైనారు. సేద్యాన్ని నమ్ముకున్న రైతులు, పొలం పనులమీద బతికే కూలినాలి జనం మిగిలారు. వాళ్ళ పరిస్థితీ దయనీయంగా ఉందిరా. వర్షాభావం రైతుల వెన్నెముకని విరిచేస్తోంది. నాసిరకం విత్తనాలు, నకిలీపురుగు మందులు వాళ్ళ ప్రాణాల్నే హరించేస్తున్నాయి".

"మీ అమ్మా, నాన్న అక్కడే ఉన్నారా?"

"ఔన్రా – మీరందరూ కుటుంబాల్తో సహా మన వూరొదిలి వచ్చేస్తిరి. తిరిగి వూరు మొహమే చూడకపోతిరి. అమ్మానాన్నల్ని చూట్టానికి మన వూరెళ్లినపుడల్లా గుండె పట్టేసినట్లవుతోందిరా. మనం పెరిగిన వూరేనా యిది అన్పిస్తోంది. ఐనా మీరందరూ కన్నతల్లి లాంటి వూరిని ఎలా మర్చిపోయార్రా?" అన్నాను.

"భలేవాడివే. మర్చిపోలేదు కాబట్టే మన వూర్నించి వచ్చి యిక్కడ స్థిరపడిన వాళ్ళందరం నెలకోసారి కల్సుకుంటున్నాం. ఒక అసోసియేషన్ ఏర్పాటు చేశాం. వచ్చే ఆదివారమే సమావేశం ఉంది. సూర్యకుమార్ ఇంట్లో. మూర్తిగాడు, లల్లీగాడు యిక్కడే ఉన్నారన్న విషయం నీకు తెలిసే ఉంటుంది. అందరూ వస్తారు. యిన్నాళ్ళూ నువ్వొక్కడివే మిస్సింగ్. తప్పకుండా రా" అన్నాడు రమణ.

చాన్నాళ్ళ తర్వాత రమణను చూశానన్న ఆనందం కన్నా వచ్చే ఆదివారం మిగతావాళ్ళని కూడా కల్చుకోబోతున్నందుకు సంతోషం కన్నా మా వూరి పరిస్థితి గుర్తొచ్చి దిగులేసింది. మేం అందరం మా వూరి పూరిపాకలాంటి ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న వాళ్ళమే. మా వూరి చివర ఉన్న విశాలమైన చెరువులోంచి నీళ్ళు కావిళ్ళతో, కుండల్తో యిళ్ళకు మోసి తాగినోళ్ళమే. మా వూరి రైతులు పండించిన ధాన్యపు గింజల్ని తిన్నవాళ్ళమే.

రమణ బి.టెక్. చేసి రకరకాల ఉద్యోగాలు మారి, చివరికి హిమాయత్‌నగర్‌లో హార్వర్డ్ స్కూలు పేరుతో మొదట ఐదో తరగతి వరకు స్కూలు ప్రారంభించాడు. అంతే. అతని దశ తిరిగింది. స్కూలుకి మంచి పేరొచ్చింది. ఇపుడు పదో తరగతి వరకు ఉంది. ఆ స్కూల్లో ఎల్కేజీ సీటు కావాలన్నా పదివేల డొనేషన్ కట్టందే సీటు దొరకని పరిస్థితి. పదేళ్ళలో లక్షలకు లక్షలు సంపాయించాడు. మెహిదీపట్నంలో అధునాతనంగా యిల్లు కట్టించాడు. యింటి ఆవరణలోనే స్విమ్మింగ్ పూల్ . . . కోటి వరకు ఖర్చయి ఉంటుందని మా వూరి జనం అనుకుంటారు.

సూర్యకుమార్‌ది గవర్నమెంటులో ఉన్నత హోదా గల ఉద్యోగం . . . నర్సింహమూర్తి కార్డియాలజీలో కొన్నాళ్ళు డాక్టర్‌గా చేసి, తనే స్వంతంగా 'మూర్తి హార్ట్ కేర్' అనే కార్పొరేట్ హాస్పిటల్ని నెలకొల్పాడు. లలితా ప్రసాద్ చిన్న చిన్న కాంట్రాక్టులు చేస్తూ, రైల్వే కాంట్రాక్టర్‌గా మారి యిపుడు నెంబర్ వన్ కాంట్రాక్టర్‌గా ఎదిగాడు.

మా వూరి మట్టిలోంచి మొలిచిన ఈ రత్నాల్ని వూరు మర్చిపోలేదు. వీళ్ళని తల్చుకుని గర్వపడనిరోజు లేదు. లలితా ప్రసాద్ యిల్లు మన వూరంత ఉంటుందట అనో, నర్సింహమూర్తి కారు మన యిల్లంత ఉంటుందట అనో గొప్పగా చెప్పుకుని, అంతటి భాగ్యం తమ వూరికే పట్టినట్లు సంబరపడి పోతారు వూరి జనం. కానీ వీళ్ళే . . .

ఆదివారం నాడు సాయంత్రం ఆరింటికే నేనూ, రమణా కలిసి సూర్యకుమార్ యింటికెళ్ళాం. మేం వెళ్ళే సమయానికే అక్కడ నర్సింహమూర్తి ఉన్నాడు.

కుమార్, మూర్తి చాలా ఆప్యాయంగా మాట్లాడారు.

టెర్రస్‌మీద పార్టీకవసరమైన ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి. టీపాయ్ మీద రెండు స్కాచ్ విస్కీ బాటిళ్ళు, ఒక రెడ్ వైన్ బాటిల్ పెట్టి ఉన్నాయి. అందమైన నగిషీలు చెక్కిన గ్లాసులు. . ఐస్ క్యూబ్స్ కంటైనర్ . . ఫ్రిజ్ వాటర్. . . నేతిలో వేయించిన జీడి పప్పు . . .

"లల్లీగాడింకా రాలేదేమిట్రా" రమణనుద్దేశించి అడిగాడు మూర్తి.

"ఏ కాంట్రాక్టు లాగేసుకోడానికి ఎంత టెండర్ వేయాలా అని ఆలోచిస్తూ మన పార్టీ గురించి మర్చిపోయి ఉంటాడు".

ఆ మాటలకు పెద్ద జోక్ విన్నట్లు అందరూ నవ్వారు.

"వాడి బలహీనతలు రెండే. ఒకటి డబ్బు, రెండు రెడ్ వైన్" అన్నాడు రమణ.

"అందుకేగా రెడ్ వైన్ బాటిల్ తెప్పించాను" అని కుమార్ అంటుండగానే –

"హాయ్ – సారీ ఫర్ ది డిలే" అంటూ లలితా ప్రసాద్ వచ్చాడు.

నా పక్కనున్న కుర్చీలో కూచుంటూ "ఏరా బుడుగూ – ఎలా ఉన్నావు? ఏం చేస్తున్నావు? ఏమిటింకా కబుర్లు" అంటూ అడిగాడు. బుడుగు నా ముద్దుపేరు. స్నేహితులంతా అలానే పిలవటం అలవాటు. నేనేదో పొడిగా సమాధానం చెప్పాను. నా మనసు పార్టీలో లీనం కావటం లేదు. చాలా అశాంతిగా ఉంది.

"ఈ రోజు వెరైటీగా ఉంటుందని ఫుడ్ ఒకే హోటల్నించి కాకుండా ఒక్కో హోటల్నించి ఒక్కో ఐటం తెప్పిస్తున్నా" అన్నాడు కుమార్.

"అదేం"

"ఒక్కో హోటల్లో ఒక్కో వంటకం ప్రసిద్ధి కదా. బ్లూ ఫాక్స్‌లో అపోలో ఫిష్, హైకింగ్ రెస్టారెంట్‌లో జింజర్ ప్రాన్స్ అండ్ పెప్పర్ ఫిష్, పిక్ అండ్ మూవ్ నుంచి చికెన్ మెజిస్టిక్, ప్యారడైజ్ హోటల్నించి మటన్ కబాబ్స్, గోల్కొండ హోటల్నించి బిర్యాని . . ."

గ్లాసుల్లోకి విస్కీ వొంపి, ఐస్ క్యూబ్స్ వేశాడు రమణ. లల్లీ తన గ్లాసులో రెడ్‌వైన్ నింపుకున్నాడు. నాకు వద్దని చెప్పాను.

"ఏంరా డ్రింక్ తీసుకోవా? అలా ఉన్నావే? ఆరోగ్యం బాగోలేదా" సూర్యకుమార్ అడిగాడు.

మనసే బాగోలేదని చెప్పాలనుకున్నాను. "వద్దురా - తాగాలని లేదు" అన్నాను. నన్నెవరూ బలవంతం చేయలేదు.

వాళ్ళు డ్రింక్ కొద్ది కొద్దిగా సిప్ చేస్తూ కబుర్లలో పడ్డారు.

"ఒరేయ్ - మన చిన్నప్పుడు స్కూలు ఎగ్గొట్టి పంటపొలాల వైపు వెళ్ళేవాళ్ళం కదా" అన్నాడు మూర్తి.

"అవున్రా - అది తెల్సుకుని మన హెడ్మాస్టర్ రాఘవాచారి పేం బెత్తంతో పిచ్చ బాదుడు బాదేవాడు కదా" అంటూ నవ్వాడు సూర్యకుమార్.

"మనం నాలుగో తరగతి చదివేటప్పుడు మన క్లాస్‌లో సుబ్బమ్మ ఉండేది గుర్తుందా. ఎంత అమాయకంగా ఉండేదో - ఒరేయ్ బుడుగూ - నీ పక్కనే కదరా కూచునేది" అన్నాడు రమణ.

"ఓసారి సుబ్బమ్మ తమ పొలం చూపించడానికి మనల్ని పిల్చుకెళ్ళింది గుర్తుందా? కొంతమేర మిరప - మిగతా పొలంలో టమేటా విరగకాసింది. మనం టమేటాలు కోసుకుని తింటుంటే సుబ్బమ్మ వాళ్ళ నాన్న ఎవడ్రా అది అంటూ కర్ర పట్టుకు వొచ్చాడు" అన్నాను.

"అమ్మో నేనెలా మర్చిపోతాన్రా? అసలే మనిషి ఆరడుగుల పొడవు –నల్లటి నిగారింపైన

శరీరం. నా ప్రైప్రాణాలు పైనే పోయాయంటే నమ్ము. లగెత్తుకుంటూ పారిపోదామనుకునే లోపల యముళ్ళా వచ్చి పడ్డాడు కదరా” అన్నాడు లల్లీ.

“తీరా మనల్ని చూశాక ‘మీరా బాబూ - ఎవరో బైటివాళ్ళనుకున్నా -తినండి - మీక్కావల్సినన్ని తినండి’ అంటూ బాగా ఎర్రగా పండిన పండ్లు కోసిచ్చాడు”.

లల్లీ నావైపు తిరిగి, “అవున్రా - జేబుల్లో నింపుకుని ఇంటికి పట్టుకెళ్ళినట్టు కూడా గుర్తు. మన వూరి కబుర్లేమిటి? సుబ్బమ్మ వాళ్ళ నాన్న బాగున్నాడా” అని అడిగాడు.

“రెండ్రోజుల క్రితమే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు” నా గొంతు బాధతో వణికింది.

కొద్దిసేపు అందరూ నిశ్శబ్దమైపోయారు.

“అయ్యో పాపం - మనిషి గుండ్రాయిలా ఉండేవాడు కదరా - ఏమొచ్చిందట” రమణ అడిగాడు.

“మూడేళ్ళ నుంచీ వర్షాల్లేక - కురిసినా సకాలంలో కురవక పంట సరిగ్గా చేతి కందటం లేదు. ఈ యేడు అప్పు చేసి పత్తి వేశాడు. పురుగు పట్టింది. నాణ్యమైన సరుకనుకుని నకిలీపురుగుల మందు కొని చల్లాడు. పంట నాశనమైపోయింది. అప్పులోళ్ళ తాకిడి ఎక్కువైంది. మన వూరనే కాదురా. ఏ వూరయినా రైతుల పరిస్థితి అధ్వాన్నంగానే ఉంది. ఆత్మహత్యలే శరణ్యాలౌతున్నాయి” అన్నాను.

“అబ్బ - పోతేపోనీలేరా - విస్కీ మత్తంతా దిగిపోయేలా చావు కబుర్లు చెప్పకురా. మన వూరి వాళ్ళం కలిసి మజా చేసుకుంటుంటే మూడ్ పాడు చేయకురా” అన్నాడు కుమార్.

“మజానా - నాకు లేదు. మనసంతా భయం. ఏ రోజు ఎవరి చావు కబురు వినాల్సివస్తుందోనని. మన వూరురా అది . . . మనం తిరిగిన పొలాలు. . . మనకు అన్నం పెట్టిన రైతులు . . . ఒక్కరొక్కరే అప్పుల బాధల్తో, నకిలీ విత్తనాల వల్లో, నాసిరకం పురుగుల మందుల వల్లో పిట్టల్లా రాలిపోతున్నార్రా. మీకు నారాయణ గుర్తున్నాడా? మనం ఒకటో తరగతి చదివే రోజుల్లో అతని పొలానికెళ్ళి కల్లం దగ్గర నిలబడితే దోసిళ్ళనిండా జొన్నలు తెచ్చి మన సంచుల్లో పోసేవాడు. ఎంత దయగా మాట్లాడేవాడో . . . పిల్లలంటే ఎంత ప్రాణమో . . .”

"అవున్రా - నారాయణ . . . అతనికిద్దరు కొడుకులు. . . పెద్దవాడు మనకు రెండేళ్ళు జూనియర్. ఐదో తరగతి తర్వాత చదువు మానేసి వాళ్ళ నాన్నతోపాటు వ్యవసాయంలోకి దిగినట్టు గుర్తు" అన్నాడు మూర్తి.

"నెలక్రితం వాడూ నారాయణ కలిసి నువాక్రాన్ తాగి నురగలు కక్కుకుంటూ చనిపోయార్రా"

"ఈ బుడుగ్గాడు చావు కబుర్లు తప్ప మరేం చెప్పడా?" అన్నాడు విసుగ్గా కుమార్.

"అసలిదంతా మాస్ హిస్టీరియా అన్పిస్తుంది నాకు. నిజంగా రైతులు ఆత్మహత్యలు చేసుకునేంత గడ్డు పరిస్థితులు ఉన్నాయంటావా? లేక ప్రభుత్వం యిచ్చే కాంపెన్సేషన్ కోసమా?" అన్నాడు రమణ.

నాకు కోపం వచ్చింది. "మనిషి ప్రాణం . . నిండు జీవితం . . కోరి కోరి ఎవరైనా ప్రభుత్వమిచ్చే కాసిని డబ్బుల కోసం వూపిరి తీసుకుంటారా? నారాయణ, అతని పెద్ద కొడుకూ చనిపోయాక వారి పెళ్ళాం బిడ్డల పరిస్థితి చూస్తే కడుపు తరుక్కుపోతుందిరా. ఉన్న కాస్త పొలాన్ని అప్పులోళ్ళు లాగేసుకున్నారు. నారాయణ భార్యా, కోడలు కూలిపని కెళ్తున్నారు. కూలీ కూడా దొరక్కపోతే అడుక్కు తినాల్సిన దారుణమైన పరిస్థితి" నా కళ్ళలో సన్నటి నీటి పొర.

రకరకాల హోటళ్ళనించి తెప్పించిన రుచికరమైన భోజన పదార్థాలు . . వాటి వాసనలు ఘుమఘుమలాడ్తూ . . . అందరూ ఆబగా తింటున్నారు.

నాకెందుకో కడుపులో దేవినట్లయింది. కొన్నేళ్ళుగా ధాన్యపు గింజల్ని పండించిన నారాయణ యింట్లో యిప్పుడు గుప్పెడు మెతుకుల కోసం దీనంగా ఎదురు చూస్తున్న అతని కుటుంబం గుర్తొచ్చింది. రెండ్రోజుల క్రితం చనిపోయిన సుబ్బమ్మ వాళ్ల నాన్న గుర్తొచ్చాడు. అతను మాకిచ్చిన ఎర్రెర్రటి టమేటా పళ్ళు గుర్తొచ్చాయి.

విందు ముగిసి అందరూ పాన్లు నములుతూ వీడ్కోలు తీసుకునే ముందు సూర్యకుమార్‌ని అడిగాను "ఎంత ఖర్చయి ఉంటుందీ?"

"ఆ ఎంతలే . . డ్రింకులూ భోజనం అన్నీ కలిసి ఓ ఇరవై వేలయి ఉంటుంది" అన్నాడు.

"సుబ్బమ్మ వాళ్ళ నాన్న తీర్చలేకపోయిన బాకీ కూడా ఇరవై వేలే" అంటున్నప్పుడు నా గొంతు గాద్గదికమైంది.

* * * * *

మరో రెణ్ణెల్లకిగాని వాళ్ళని కలవటం కుదరలేదు. గత నెల లల్లీ వాళ్ళింట్లో పార్టీ జరిగిందట. ఈసారి రమణ వాళ్ళింట్లో . . . స్విమ్మింగ్‌పూల్‌కి దగ్గరగా కుర్చీలు వేశారు. విస్కీ సీసాలు. . . వైన్ సీసాలు. . . గ్లాసుల గలగల . . . వంటలన్నీ యింట్లోనే ప్రత్యేకంగా వంట మనిషిని పెట్టి చేయించాడట. పీతలు, రొయ్యలు, పిట్టమాంసం, చేపలు, వేట మాంసం . . ఒకటేమిటి. . . రకరకాల వంటకాలు. .

"ఏరా బుడుగూ – ఈ సారి ఎవరి చావు కబురు మోసుకొచ్చావ్" అన్నాడు కుమార్. అతని గొంతులో ధ్వనించిన అపహాస్యాన్ని పట్టించుకోకుండా చెప్పాను.

"గత రెండు నెలల్లో మనవూరి ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నార్రా. యిద్దరు పురుగుల మందు తాగి చనిపోతే, ఒకతను తన పొలంలోని చెట్టుకు వురేసుకుని చచ్చిపోయాడు".

"ఏమైనా పిచ్చా వీళ్ళకి? ఎందుకిలా చచ్చిపోతున్నార్రా?" అన్నాడు మూర్తి.

"అబ్బ అనవసరమైన విషయాలన్నీ మనకెందుకురా?" అన్నాడు లల్లీ.

"మనకెందుకంటావేమిట్రా – మన ఐదుగురిని కలిపిన అంతస్సూత్రం మన వూరు. ఒక్కవూరి వాళ్ళం కాబట్టే మన మధ్య ఈ అనుబంధం . . ."

"మన విషయం వేరు. మనం కలిసి చదువుకున్నాం. . . స్నేహితులం".

"ఒరేయ్ – అది మన వూరు. మనకు అన్నం పెట్టిన రైతుల్రా వాళ్ళు. రైతుల ఆత్మహత్యలకు మనలాంటి వాళ్ళు కూడా బాధ్యులే. అంతా ప్రభుత్వమే చూసుకుంటుందనీ – మనకేమీ సంబంధం లేనట్లు ప్రవర్తించటం అమానుషంరా. మీ నలుగురూ లక్షలకు లక్షలు సంపాయించారు. ఇలా పార్టీలంటూ మన వూరి పేరు చెప్పి వేలకు వేలు ఖర్చు చేయకపోతే మన వూరి రైతుల్ని ఆదుకోండిరా. రైతుల ఆత్మహత్యలు ఓ విషాదమైతే, బతికున్న వాళ్ళ కుటుంబాలు రోజుకో చావు చస్తున్నాయి. అది ఎంతటి విషాదమో చూస్తేగాని అర్థం కాదు. మన వెంకటప్పయ్య భార్య బిచ్చమెత్తుకుంటోందిరా. మన వెంకటప్పయ్యరా . . మనతో కల్సి పదో తరగతి వరకూ చదివిన వెంకటప్పయ్య కరెంటు

తీగని కౌగిలించుకుని ఆత్మహత్య చేసుకున్నాడ్రా . . . ఇలా డబ్బుని తగలేసే బదులు మీకు చాతనైన సాయం చేయండిరా".

"మేం కష్టపడి సంపాయిస్తోంది దేశాన్ని ఉద్ధరించడానికి కాదు బాబూ. మా సంసారాల కోసం. మా పెళ్ళాం బిడ్డల కోసం" అన్నాడు లలితా ప్రసాద్.

"నీలా మేం కూడా సెంటిమెంటల్ ఫూల్స్ అయి ఉంటే ఈ రోజు ఇంతటి ఉన్నత స్థితిలో ఉండేవాళ్ళం కాదు" అన్నాడు మూర్తి.

"ఛీ – మీరసలు మనుషులేనా – మానవత్వం ఇసుమంతైనా లేదురా? మనూర్లో రైతులు ఉసుళ్ళలా ఉసుర్లు తీసుకుంటుంటే తాగి తందనాలాట్టానికి మీకు మనసెలా ఒప్పిందిరా? మీ విస్కీ బాటిళ్ళంత ఖరీదు కాదురా ఒక రైతు కుటుంబాన్ని ఆదుకోవటం . . . మీరు నా స్నేహితులని చెప్పటానికి సిగ్గేస్తోందిరా. మీ దిక్కుమాలిన అసోసియేషన్‌కి ఏ తాగుబోతు పేరో పెట్టుకోక మనూరి పేరెందుకురా? డబ్బున్నంత మాత్రాన ఉన్నతులైపోర్రా . . . హృదయం ఉండాలి. సాటి మనిషి కష్టాన్ని చూసి చలించే మెత్తని మనసుండాలి" కోపంతో లేచి వచ్చేశాను.

"ఈ పిచ్చోడు నీకెక్కడ దొరికాడ్రా? జాలీ మూడ్‌లో జారిన విషపు చుక్క. . . ." రమణతో సూర్యకుమార్ అనటమూ – అందరూ పెద్దగా నవ్వటమూ నాకు విన్పించాయి.

* * * * *

ఓ వారం తర్వాత రమణ నుంచి ఫోనొచ్చింది. "ఒరేయ్ బుడుగూ! ఆ రోజు నువ్వు కోపంతో అనిపోయిన మాటలు మనశ్శాంతి లేకుండా చేశాయి. ఆలోచించే కొద్దీ నువ్వు చెప్పింది నిజమేననిపిస్తోంది. వెంకటప్పయ్య ఆత్మహత్య చేసుకున్నాడని పేపర్లో చదివినపుడు చాలా అలజడికి లోనైనాను. క్లాసులో నా పక్కనే కూచునేవాడు కదరా. గుండె పిండేసినట్లయింది".

రమణ అలా స్పందించటం నాకు చాలా సంతోషం కలిగించింది. "సహ విద్యార్థి అయినందుకే కాదురా – సాటి మనిషి అయినందుకు బాధ పడాలి. ఒరే రమణా – నువ్వయినా మిగతా వాళ్ళకు చెప్పరా. మీరు నలుగురూ కొందర్నైనా ఆదుకోగల స్థితిలో ఉన్నార్రా. అన్నిటికంటే దారుణమైన విషయం ఏమిటో తెలుసా – ఓ మనిషి ఆకలితో చనిపోవటం. సభ్య సమాజం తలదించుకోవాల్సిన ఘోరం అదేరా. ప్రభుత్వం చేసేదేదో

చేయనీ. మన వంతు మనం చేద్దాం. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాల్ని ఆదుకోండి. అప్పులు ఉరితాళ్ళుగా మారకుండా అడ్డుకోండి. మీకు చాతనైనంత చేయండిరా" అన్నాను.

"మిగతా వాళ్ళతో కూడా మాట్లాడ్తాను" అన్నాడు రమణ.

మరో నాలుగు రోజులకు లలితా ప్రసాద్ ఫోన్ చేశాడు - "మేం నలుగురం ఓ నిర్ణయానికొచ్చాంరా. యికనుంచి నెలనెలా పార్టీలు బంద్. మన వూరి పేరుతో పిల్చుకునే మన అసోసియేషన్‌ని మన వూరి రైతుల వెల్ఫేర్ అసోసియేషన్‌గా మార్చేస్తున్నాం. కార్యాచరణ గురించి చర్చించడానికి ఈ ఆదివారం మీ యింటికొస్తున్నాంరా" అన్నాడు.

"మా యింటికా? మీరందరూ లక్షాధికార్లు. నేను పేదోణ్ణిరా" అన్నాను నవ్వుతూ.

"నలుగురికీ చాయ్ ఇస్తే చాలురా" వాడూ ఆనందంగా నవ్వటం ఫోన్లో మధురంగా విన్పించింది.

"ఈ నెలాఖరుకి మనం ఐదుగురం కలిసి మనూరు వెళ్తున్నాం. రెడీగా ఉండు" అన్నాడు లల్లీ.

ఆ ఆదివారం సాయంత్రం . . దిగువ మధ్యతరగతి వాళ్ళు మాత్రమే నివసించే మా గల్లీలోకి నాలుగు ఖరీదైన కార్లు వచ్చి మా యింటి ముందు ఆగాయి. వాళ్ళని లోపలికి ఆహ్వానిస్తున్నప్పుడు - ఎర్రెర్రని టమేటాలు కోసిచ్చిన సుబ్బమ్మ వాళ్ళ నాన్న. . . మా పుస్తకాల సంచుల్లో దోసిళ్ళ నిండా జొన్నలు నింపిన నారాయణ . . . మాతో కలిసి చదువుకున్న వెంకటప్పయ్య . . . మిగిలిన రైతులూ . . . అందరూ గుర్తొచ్చారు. 'మీ రుణం కొంతైనా తీర్చుకోబోతున్నందుకు సంతోషంగా ఉంది' అనుకున్నాను మనసులో.

**(ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక - జూన్, 2005)**